ప్రారంభమైన వైద్య సేవలు

బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో అందిస్తున్న వైద్య సేవలు

బాన్సువాడ, జూన్ 11 : బాన్సువాడలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయి. శిథిలావస్థకు చేరిన ఏరియా దవాఖాన భవనాన్ని కూల్చివేయడంతో రోగులకు ఇబ్బందులు కలుగకుండా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఉర్దూ మీడియం భవనంలో రోగులకు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చినట్లు దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు.

పంట పొలాల్లో విద్యుత్ మరమ్మతులు

నాగారం శివారులో వైర్లను సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

బాన్సువాడ, జూన్ 11 : రైతుల పంట పొలాల్లో వేలాడుతున్న, వదులుగా ఉన్న లైన్లు, విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ సిబ్బంది సరిచేస్తున్నారు. ఇటీవల వీచిన ఈదురుగాలులకు పంటపొలాల్లో ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లకు తగలడంతోపాటు వైర్లు లూస్ కావడంతో మరమ్మతు పనుల్లో విద్యుత్ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. పంట పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, వదులుగా ఉన్న వైర్లు, విరిగిన స్తంభాల మార్పు పనులను రైతులు పంటపొలాల్లో డబ్బులు చెల్లించి పనులు చేయించుకుంటున్నారు. వర్షాలు కురిస్తే పంటపొలాల్లో చేయలేమని, మరమ్మతు పనులపై ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది దృష్టి సారించారు.

స్కూల్ యూనిఫామ్స్ పరిశీలన

బీబీపేట్, జూన్ 11: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పాఠశాల విద్యార్థులకు మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాల్లో మహిళలు కుడుతున్న స్కూల్ యూనిఫామ్స్‌ను ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ తుజాల్‌పూర్‌లో మంగళవారం పరిశీలించారు. మాందాపూర్ ఎంపీవో కృష్ణ పరిశీలించారు. అనంతరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. మండలంలోని 22 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టిన పనులు పూర్తయినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

బీబీపేట్, జూన్ 11 : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. దోమకొండ జూనియక్ కళాశాల నుంచి రికార్డు అసిస్టెంట్ రాజేందర్ డిప్యూటేషన్‌పై అడ్మిషన్ల స్వీకరణకు పంపినట్లు తెలిపారు.

అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

కామారెడ్డి రూరల్, జూన్ 11 : రైతులకు విత్తనాలు, ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి హెచ్చరించారు. కామారెడ్డి పట్టణంలోని ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఫెర్టిలైజర్స్ స్టాక్స్, ఈపాస్ మిషన్స్, గ్రౌండ్ స్టాక్, రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. డీలర్లు ఎమ్మార్పీకి ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. కామారెడ్డి సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారం'పై సమావేశం

బీబీపేట్, జూన్ 11: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో అధ్యాపకుల నియామకం, అదనపు కోర్సులు, శాశ్వత భవనం ఏర్పాటుకు అన్ని పార్టీల నాయకులతో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేతోపాటు ఇతర ముఖ్య ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేసేలా సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. ఈ విషయమై మరోసారి సమావేశం ఏర్పాటుకు తేదీని ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు సమావేశానికి హాజరు కావాలన్నారు. వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీసత్యనారాయణ, ఎంపీటీసీలు రవి, పల్లవిభూమేశ్, నీరజానర్సింహులు, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఆసీఫ్, బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్ గౌడ్, నాయకులు సంతోష్‌గౌడ్, దేవరాజ్, శివ, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

భిక్కనూరు, జూన్ 11 : మండల కేంద్రంలోని రైతుల వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఏపీసీ గోపి వానకాలంలో విత్తనాల ఎంపిక, సాగులో మెళకువలు, వరంగల్ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ప్రశాంత్ పత్తిలో ఎక్కువ సాంద్రత పత్తి సాగులో మెళకువల గురించి వివరించారు. అనంతరం పద్మశ్రీ గ్రహీత చింతల వెంకట్ సేంద్రియ వ్యవసాయం, రైతుల అనుభవాల గురించి వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కామారెడ్డి డివిజన్ ఏఈవోలతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, ఏవోలు రాధారెడ్డి, పవన్‌కుమార్, జోత్స్న రమ్య, కామారెడ్డి డివిజన్ ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లోని పూడిక తొలగింపు

బాన్సువాడ టౌన్, జూన్ 11 : వానకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను శుభ్రం చేయించినట్లు మున్సిపల్ చైర్మన్ గంగాధర్ తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రధాన మురికి కాలువలను మున్సిపల్ కార్మికులతో మంగళవారం శుభ్రం చేయించినట్లు చెప్పారు. బాన్సువాడ, బోధన్ ప్రధాన రహదారి వెంట ఉన్న మురికి కాలువలను మున్సిపల్ చైర్మన్ స్థానిక సీనియర్ నాయకుడు ఎజాస్, మున్సిపల్ అధికారి మలికార్జున్‌తో కలిసి పరిశీలించారు.

మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ల పరిశీలన

బీబీపేట్, జూన్ 11 : మండల కేంద్రంతోపాటు మాందాపూర్, తుజాల్‌పూర్, యాడారం, మల్కాపూర్, ఇస్సాన గర్ తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కలెక్షన్లను ఇంటింటికీ తిరుగుతూ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. తుజాల్‌పూర్‌లో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ పరిశీలించి నల్ల కలెక్షన్ల వివరాలను పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

దోమకొండ/భిక్కనూరు/బీబీపేట, జూన్ 11 : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి గ్రామాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దోమకొండతోపాటు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పెట్టెల్లో ప్రజలు వేసిన ఫిర్యాదుల వివరాలను దోమకొండ తహసీల్దార్, ఎంపీడీవోకు బీజేపీ మండల నాయకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆయా గ్రామాలకు సంబంధించిన 47 ఫిర్యాదులను తహసీల్దార్‌కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, రాజేశ్, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మనోజ్ కుమార్, రవి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. బీబీపేట్‌తోపాటు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పెట్టెలో ప్రజలు వేసిన ఫిర్యాదుల వివరాలను బీబీపేట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్‌కు ఎమ్మెల్యే తరపున బీజేపీ మండల నాయకులు అందజేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన ఫిర్యాదులు తహసీల్దార్‌కు ఎనిమిది, ఎంపీడీవోకు 23 ఫిర్యాదులు అందజేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌గౌడ్, నాయకులు రాజు, ప్రవీణ్, దేవరాజ్ గౌడ్, శివ, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులో తహసీల్దార్, ఎంపీడీవోలకు ఫిర్యాదుల పెట్టెలో వేసిన దరఖాస్తులను బీజేపీ నాయకులు అందజేశారు. తహసీల్దార్‌కు భూమికి సంబంధించిన 103 ఫిర్యాదులు, నాలుగు రేషన్ కార్డుకు గురించి, ఎంపీడీవోకు పారిశుద్ధ్యం గురించి 12, పింఛన్ గురించి 35 ఫిర్యాదులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రమేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తిర్మలేశ్, శంకర్, విలాస్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట్‌లో ఎంపీడీవోకు దరఖాస్తులను అందజేస్తున్న బీజేపీ నాయకులు

భిక్కనూరులో తహసీల్దార్‌కు ఫిర్యాదులను అందజేస్తున్న నాయకులు

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జూన్ 11 : సెట్విన్ ద్వారా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని ఆ సంస్థ కో ఆర్డినేటర్ సయ్యద్ మొయినుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్, డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్, మోహిందీ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. శిక్షణాకాలంలో ఉచిత స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని అన్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత సెట్విన్ ప్రభుత్వ సంస్థ ద్వారా క్యూర్ కోడ్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7386180456, 7989159121 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో చేరేందుకు..

కామారెడ్డి, జూన్ 11 : జిల్లాలో బధిర (చెవిటి) బాలబాలికలకు బధిరుల ఆశ్రమ పాఠశాల కరీంనగర్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి 1 నుంచి 6వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలు అర్హులని తెలిపారు. ప్రవేశాల కోసం సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, టీసీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బధిరుల ఆశ్రమ పాఠశాల మల్కాపూర్ రోడ్ శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా, విజయపురి కాలనీ కరీంనగర్‌లో నేరుగా సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000013639, 9000221301, 9666868755 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థికి సన్మానం

విద్యార్థినిని అభినందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మాచారెడ్డి, జూన్ 11 : మండల కేంద్రానికి చెందిన జూబేరియా ఇటీవల పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించింది. హైదరాబాద్‌లోని వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థినిని సన్మానించినట్లు మాచారెడ్డి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటాచారి తెలిపారు. పది జీపీఏ సాధించి పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టిన విద్యార్థిని జుబేరియాకు పాఠశాల బృందం అభినందనలు తెలిపింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామారెడ్డి రూరల్, జూన్ 11 : కామారెడ్డి మండలం దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రిడ్జి వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోగా అతడిని వెంటనే కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడన్నారు. ఎరుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిస్తే కామారెడ్డి రూరల్ సీఐ 8712686148, దేవునిపల్లి ఎస్సై 8712686150 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బ్రిడ్జి సైడ్‌వాల్‌కు మరమ్మతు చేస్తున్న కూలీలు

లింబూర్ - తడిహిప్పర్గ రహదారికి చేపట్టిన మరమ్మతులు

డోంగ్లీ, జూన్ 11: గ్రామీణ రోడ్ల దుస్థితిపై నమస్తే తెలంగాణలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మండలంలోని ఆయా గ్రామాల రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. మండలంలోని లింబూర్ నుంచి సిర్పూర్, డోంగ్లీ నుంచి కుర్ల వెళ్లే రహదారులపై గుంతలు ఏర్పడ్డాయని, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి మూల మలపులు ప్రమాదకరంగా మారాయని వివరిస్తూ.. నమస్తే తెలంగాణలో 'రోడ్లపై గుంతలు.. అధికారుల కండ్లకు గంతలు' శీర్షికతో మే 20వ తేదీన వార్త ప్రచురితం అయ్యింది. దీనిపై అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న చెట్లను జేసీబీ సహాయంతో తొలగిస్తున్నారు. రోడ్లపై గుంతలను పూడ్చివేయిస్తున్నారు. బ్రిడ్జిలకు ఉన్న రక్షణ గోడలను బాగుచేయిస్తున్నారు. దీంతో వాహనదారులతోపాటు మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

పోచారం ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీరందించాలి

మండల సమావేశంలో సభ్యుల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

ఎల్లారెడ్డి, జూన్ 11: పోచారం ప్రాజెక్టు చివరి ఆయకట్టుకూ సాగునీరు అందించాలని అన్నాసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి డిమాండ్ చేశారు. సాగు కాలువలు సరిగా లేక రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వాటిని బాగు చేయించాలని కోరారు. ఎల్లారెడ్డి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కర్రె మాధవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చించారు. నీటిపారుదల శాఖ ఏఈ శ్రీకాంత్ తమ శాఖ అభివృద్ధి పనులను వివరించారు. కాగా ఎంపీటీసీ ఉమాదేవి రైతులకు సాగునీరు అందించాలని కోరడంతో ఆయన కాలువలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎంఈవో వెంకటేశం మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులకు ఇదే చివరి సమావేశం కావడంతో మండల పరిషత్ అధ్యక్షురాలు మాధవి, అన్నాసాగర్, అడ్విలింగాల, మత్తమాల, లింగారెడ్డిపేట ఎంపీటీసీ సభ్యులు ఉమాదేవి, బత్తుల పార్వతి, నర్సింహులు, శ్రీధర్ గౌడ్‌కు ప్రత్యేకంగా శాలువాలు కప్పి సన్మానించారు. ఎంపీడీవో శ్రీలక్ష్మి, ఎంపీవో ప్రకాశ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 11: పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈవో వెంకటేశానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి ప్రహరీని నిర్మించాలని, కళాశాలలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్, కార్యకర్తలు జాషువా, వంశీ, సాయికిరణ్, ప్రకాశ్, వెంకటేశ్, రేవంత్, సాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసన్న

డోంగ్లీ, జూన్ 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ప్రతి మంగళవారం నిర్వహించే 'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రసన్న అన్నారు. డోంగ్లీ దవాఖానలో ఆరోగ్య మహిళలో భాగంగా అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మండలంలోని మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉదయ్‌కుమార్, పండరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే

గాంధారి/బిచ్కుంద, జూన్ 11: గాంధారి మండలంలోని పేట్‌సంగెం గ్రామంలో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేను ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్నదా..? ఏమైనా లీకేజీలు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కు సూచించారు. కార్యక్రమంలో కారోబార్ రవి తదితరులు పాల్గొన్నారు. బిచ్కుంద మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో మహబూబ్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నల్లాలు బిగించారా..? ఒక కుటుంబానికి సరిపడా నీళ్లు వస్తున్నాయా..? తదితర వివరాలను సేకరించారు. కార్యక్రమంలో రమేశ్, పద్మ, సతీశ్‌తోపాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెస్ బాక్సింగ్‌లో బంగారు పతకాలు

సాధించిన పతకాలతో ప్రతిభ, ఆమె తమ్ముడు విజయ్‌రాఘవేంద్ర

బిచ్కుంద, జూన్ 11: కేరళలో నిర్వహించిన జాతీయ చెస్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మండలంలోని పెద్ద తక్కడ్‌పల్లికి చెందిన ప్రతిభ మూడు బంగారు పతకాలు, విజయ్ రాఘవేంద్ర వెండి పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా వారి తండ్రి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ట్రావెలింగ్ స్పాన్సర్‌గా వ్యవహరించిన డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తే తమ బిడ్డలు మరిన్ని పతకాలు సాధిస్తారని తెలిపారు.

బిచ్కుంద ఇన్‌చార్జి ఏడీఏగా లక్ష్మీ ప్రసన్న

బాధ్యతలను స్వీకరిస్తున్న లక్ష్మీప్రసన్న

బిచ్కుంద, జూన్ 11: బిచ్కుంద ఇన్‌చార్జి ఏడీఏగా సీహెచ్ లక్ష్మీప్రసన్న మంగళవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. బిచ్కుంద ఏడీఏ పోస్టు కొన్ని రోజులుగా ఖాళీగా ఉన్నది. దీంతో ఉన్నతాధికారులు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏడీఏగా విధులను నిర్వహిస్తున్న లక్ష్మీప్రసన్నకు అదనపు బాధ్యతలను అప్పగించారు. బాధ్యతలను చేపట్టిన ఆమెకు బిచ్కుంద ఏవో రాజలింగం అభినందనలు తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

గాంధారి, జూన్ 11: మండలంలోని సర్వపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల బోయిన వెంకట్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం పరామర్శించారు. వెంకట్ కుటుంబ సభ్యులు ఇల్లు నిర్మించుకునేందుకు తనవంతుగా రూ.నాలుగు లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటానని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ప్రైవేటు దవాఖాన సీజ్

గాంధారిలోని ఓ దవాఖానలో తనిఖీ చేస్తున్న డాక్టర్ సాయికృష్ణ

గాంధారి, జూన్ 11: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గాంధారిలోని పలు ప్రైవేటు దవాఖానలను వైద్యాధికారి సాయికృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని సరిత ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఎలాంటి సర్టిఫికెట్లు లేని వ్యక్తి నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దవాఖానను సీజ్ చేశారు. నిబంధనలను విరుద్ధంగా క్లినిక్‌ను నిర్వహిస్తున్న వ్యక్తిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నయీం, ఏఎన్ఎం అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 11: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కంచర్ల బాల్‌కిషన్ గుప్తాను మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మంగళవారం సన్మానించారు. ఆయనకు పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు. నాగం సాయిబాబా, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సకావత్ అలీ, గఫార్ పాల్గొన్నారు.

అగ్నిపథ్ జవానుకు..

పెద్దకొడప్‌గల్, జూన్ 11: మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అలీ అగ్నిపథ్‌లో జవాను శిక్షణను పూర్తి చేసుకున్నాడు. అతడు స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులు మంగళవారం శాలువా కప్పి సత్కరించారు. సం తోష్, హన్మంత్, రాజు పటేల్, అశోక్ పటేల్, చందు పటేల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బడి బాట

డోంగ్లీ/ నిజాంసాగర్, జూన్ 11: బడిబాటలో భాగంగా డోంగ్లీ, మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచలో ఉపాధ్యాయులు మంగళవారం ఇంటింటికీ తిరిగారు. సర్కారు బడుల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

ప్రభుత్వ కాలేజీల్లోనే నాణ్యమైన విద్యా బోధన

అడ్మిషన్‌ను అందజేస్తున్న అధికారి

నిజాంసాగర్, జూన్ 11: ప్రభుత్వ కాలేజీల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి షేక్ సలీం అన్నారు. నిజాంసాగర్ ప్రబుత్వ కాలేజీ నిర్వహణ కోసం భవనాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. పలువురు విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ సాయిరాం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లికార్జున్‌తోపాటు అనిశ్, రాము రాథోడ్, గాండ్ల రమేశ్, చందా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

నాగిరెడ్డిపేట, జూన్ 11: పాఠశాలల్లో మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు స్థానిక ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సూచించారు. మండలంలోని మాల్తుమ్మెద ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి, మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాలలు బుధవారం నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మిగిలిన పనులను త్వరగా చేపట్టాలన్నారు. ఇష్టానుసారంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపడితే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం గ్రామ శివారులోని నర్సరీని పరిశీలించి, మొక్కల మధ్యలో ఉన్న గడ్డిని తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పర్భన్న, బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, మల్లేశం, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాల్తుమ్మెద పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ